క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న దాత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి బుధవారం హైదరాబాద్‌కు చెందిన సాంబశివ రావు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జునప్రసాద్ ఈ విరాళాన్ని స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

త్వరితగతిన గృహ నిర్మాణాలు


పాల్గొన్న హౌసింగ్, ఉపాధి సిబ్బంది

ఏర్పేడు: జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ గిడ్డయ్య ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో కాంట్రాక్టర్లు, హౌసింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ ఊరందూరు, ముసలిపేడు, మర్రిమంద, కందాడు జగనన్న లేఅవుట్లలో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా నిర్మాణాల్లో ఆలస్యం తలెత్తుతోందని తెలిపారు. పనులకు బిల్లులు వెంటవెంటనే చెల్లిస్తున్నా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. డిసెంబరు నెలాఖరు కెల్లా నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌కుమార్‌రెడ్డి, ఏపీఓ దేవరి పాల్గొన్నారు.

పోస్టల్‌లో పొదుపు.. ఖర్చులకు అదుపు


తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : పోస్టల్ శాఖలో పొదుపు చేయడం ద్వారా ప్రతి ఇంటా ఖర్చులను అదుపు చేసుకునేందుకు అవకాశం లభిస్తుందని తిరుపతి పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరిండెంట్ జాఫర్ సాధిక్ అన్నారు. తొట్టంబేడు ఎంపీడీవో కార్యాలయం మీటింగ్ హాలులో బుధవారం పోస్టల్ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి కుటుంబం పొదుపు పాటించడం ఆవశ్యకమన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పోస్టల్ శాఖ ఇంటింటా పొదుపు పంట పేరుతో ఖాతాను ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. ఈ పొదుపు పథకం కింద కలిగే ప్రయోజనాను వివరించారు. పోస్టల్ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నేడు రేణిగుంటలో 'మన వద్దకే మన ఎమ్మెల్యే'

రేణిగుంట: ప్రజా సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి గురువారం మన వద్దకే మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఎమ్మెల్యే అక్కడే ఉండి ప్రజా సమస్యలను తెలుసుకుని, ఆయా శాఖల అధికారులు పరిష్కరించే దిశగా ఆదేశాలివ్వనున్నట్లు వివరించారు. మండలంలోని ప్రజలు సమస్యలను విన్నవించుకోవచ్చని తెలిపారు.

మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- హామీలన్నింటినీ అమలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- 'వై ఏపీ నీడ్స్ జగన్'లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం


వరదయ్యపాళెం: పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని, ఇలాంటి పాలన కోసం మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయ్యేలా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. బుధవారం వరదయ్యపాళెం సచివాలయం-1లో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం లబ్ధిదారులతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలు కులమతాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. వరదయ్య పాళెం సచివాలయం-1 పరిధిలో రూ. 48.98 కోట్లు ప్రత్యక్షంగా, పరోక్షంగా సంక్షేమం, అభివృద్ధికి ఖర్చు చేసినట్లు తెలిపారు. 2వేల జనాభా ఉన్న సచివాలయ పరిధిలో ఇంత పెద్ద ఎత్తున జరిగిన అభివృద్ధి, సంక్షేమం ప్రతిపక్ష పార్టీలకు కనిపించలేదా? అని ఆయన ప్రశ్నించారు. 2019లో ఇచ్చిన ప్రతి హామీని 100శాతం అమలు చేసిన జగనన్నను మళ్లీ రానున్న 2024 ఎన్నికల్లో సీఎం చేసుకునేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని, వీటి గురించి రచ్చబండలు, గ్రామ కూడళ్లలో చర్చ జరిగే విధంగా గృహసారథులు, గ్రామ వలంటీర్లు, పార్టీ శ్రేణులు సమన్వయంగా కృషి చేయాలన్నారు. వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా ద్వారా 25 మంది లబ్ధిదారులకు రూ. 25లక్షల మెగా చెక్కును అందజేశారు. అనంతరం వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఎమ్మెల్యే పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, మండల యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, సీఎల్ఎన్‌పల్లె సర్పంచ్ దుడ్డు వేణు, నాయకులు కుమారస్వామి, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, పంచాయతీ ఈఓ బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి

సత్యవేడు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో కులాలు, మతాలు, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఇలాంటి పాలన కావాలంటే రాష్ట్రానికి మళ్లీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డి గెలిపించుకోవాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.సుశీల్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన సర్పంచ్ మధుసూదన్‌రావుతో కలసి ఎంపీడీఓ ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం చేపట్టారు. సచివాలయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. అంతకు ముందు వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలో రూ. 23.1 కోట్లు వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందారన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీ చంద్రశేఖర్, సచివాలయ కన్వీనర్ ఎన్.వెంకటరాయుడు, మధురాజు, గృహసారథులు ఎం.రవి రాజు, డి.శశికళ, సెక్రటరీ కె.రజిత, సంఘమిత్రల తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురం మండలంలో..

నాగలాపురం: మండలంలోని వేంబాక్కం గ్రామ సచివాలయంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు ఆధ్వర్యంలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎంపీడీఓ వీకేఎం బాబు, సర్పంచ్‌లు సుధ, తిన్నరుసు, జెడ్పీటీసీ సభ్యురాలు సుమతి, ఎంపీపీ సింధూ శ్యామ్, ట్రేడ్ యూనియన్ నాయకుడు ఎస్ఎం.సురేష్, ఎంపీటీసీ సభ్యుడు రాజ, వైద్యాధికారి విజయ్‌కుమార్, ఉప సర్పంచ్ సునీత, నాయకులు దేశన్, ఏలుమలై, మహేష్, కులశేఖర్ రెడ్డి, అలగేశన్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి కోసం జగనన్నే కావాలి

నారాయణవనం: రాష్ట్రంలో పేదల సంక్షేమం, అభివృద్ధి సీఎం జగనన్నకే సాధ్యమని, ఇలాంటి పాలన మళ్లీ రావాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మళ్లీ ఆదరించాలని జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్‌కుమార్ అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని వీకే పాళ్యం సచివాలయ పరిధిలోని సముదాయంలో రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం సంక్షేమం, అభివృద్ధి వివరాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 75 ఏళ్లలో జరగని అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సారకాయలు, సర్పంచ్‌లు సుబ్రమణ్యంరెడ్డి, ధర్మలింగం, వైస్ ఎంపీపీ శివశంకర్, ఎంపీటీసీ సభ్యుడు పొన్నుస్వామి, ఎంపీడీవో కృష్ణమూర్తి, అన్నాదొరై, సింగిల్‌విండో చైర్మన్ ఊరప్ప, కైలాసకోన ఆలయ చైర్మన్ సుబ్రమణ్యం, నాయకులు ధర్మయ్య, హేమచంద్రారెడ్డి, సోడా మణి రెడ్డి, చిన్నదొరై తదితరులు పాల్గొన్నారు.


సత్యవేడు: పథకాల బోర్డు ఆవిష్కరణ


నాగలాపురం: పార్టీ జెండా ఆవిష్కరణ


నారాయణవనం : పార్టీ జెండా ఆవిష్కరణలో నాయకులు

పచ్చమీడియాతో విషం కక్కుతున్న బాబు

వరదయ్యపాళెం: అధికారం కోసం సొంత మామను వెన్నుపోటు పొడిచిన మాజీ సీఎం చంద్రబాబు ప్రజలను దగా చేసేందుకు మరోసారి సిద్ధమవుతున్నారని, అందుకు పచ్చమీడియాతో విషం కక్కుతున్నారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దుయ్యబట్టారు. బుధవారం వరదయ్యపాళెంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్యవేడు నియోజకవర్గానికి చుట్టపుచూపుతో వచ్చే అడ్రస్ లేని ప్రతిపక్ష నాయకులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పేదరికం నిర్మూలనే ధ్యేయంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల కోసం సీఎం జగనన్న అహర్నిశలు కృషి చేస్తుంటే, సోషల్ మీడియాలో స్థాయిలేని ప్రతిపక్ష నాయకులు విమర్శించడం అర్థరహితమన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో రూ. కోట్ల అభివృద్ధి, సంక్షేమం కనిపించడం లేదా అని ప్రశ్నించారు. జరిగిన అభివృద్ధిని తెలుసుకునేందుకు ప్రతిపక్ష పార్టీ నేతలు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆయన హితవు పలికారు.

నవ్వులాటగా లోకేష్ పాదయాత్ర

యువగళం పేరుతో లోకేష్ చేపడుతున్న పాదయాత్ర నవ్వులాటగా మారిందని ఎమ్మెల్యే ఆదిమూలం ఆరోపించారు. నెలకు, సంవత్సరానికి తేడా తెలియని స్థితిలో లోకేష్ ఉన్నారన్నారు. పాదయాత్రలో తాను ఏమి మాట్లాడుతున్నాడో అర్థం కాని రీతిలో ఆయన వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు.

వెబ్ పోర్టల్‌ను వినియోగించుకోండి

తిరుపతి అర్బన్: ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాల నివారణకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేసిందని, బాధితులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి చెన్నయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీవోఏ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ పోర్టల్‌లో సమస్యను నమోదు చేస్తే పోలీస్, రెవెన్యూ, సంక్షేమశాఖ, జ్యుడీషియల్ విభాగాలకు సమస్య సమాచారం తెలుస్తుందని వెల్లడించారు. దీంతో సమస్యకు త్వరగా పరిష్కారం లభిస్తుందని వివరించారు.

ముక్కంటి సేవలో దర్శకుడు పరశురామ్


ఆలయంలో దర్శకుడు పరశురాం

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని బుధవారం సినీ దర్శకుడు పరశురామ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి ఆయనకు దర్శన ఏర్పాట్లు చేశారు.

మహిళ అదృశ్యం

తిరుమల: శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చిన దంపతుల్లో భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు చేశాడు. తిరుమల వన్‌టౌన్ పీఎస్ ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాలు... తమిళనాడు రాష్ట్రం, తిరువళ్లూరు జిల్లా, తిరుత్తణికి చెందిన జయరామన్ పుణ్యకోటి, జ్యోతిలక్ష్మి(58) దంపతులు ఈ నెల 22న తిరుమలకు వచ్చి శ్రీవారి దర్శనానికి వెళ్లారు. దర్శనానంతరం బయటకు వచ్చి భక్తుల రద్దీతో విడిపోయారు. దీంతో భర్త ఆమె కోసం వెతికినా కనపడలేదు. బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసును నమోదు చేశారు. అదృశ్యమైన మహిళకు చెవుడు, నత్తి ఉంది. మహిళను గుర్తిస్తే 08772289027 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

రైతుల జీవితాల్లో వెలుగులు


బుచ్చినాయుడుకండ్రిగలో పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధితోపాటు భూసంస్కరణలకు ప్రాధాన్యమిస్తూ రైతులకు జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన డీకేటీ పట్టాలతోపాటు, జగనన్న కల్యాణమస్తు, షాదితోఫా మెగా చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూవివాదాలకు శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భూముల రీసర్వే రైతులకు ఓ వరమన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా 100 సంవత్సరాల తర్వాత గ్రామీణ, పట్టణ, ప్రాంతాల్లో వ్యవసాయ, గ్రామ కంఠం స్థిరాస్తుల సర్వే జరుగుతుందని తెలిపారు. భూముల రీ సర్వేలో అన్ రిజిష్టర్, వంశపారంపర్యం భూములను గుర్తించి రికార్డులలలో నమోదు చేసి శాశ్వత చట్టబద్ధత కల్పిస్తున్నారని, పెండింగ్‌లో ఉన్న భూసమస్యలు పరిష్కరిస్తున్నారని తెలిపారు. 20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూయాజమానులకు సంపూర్ణ హక్కులు కల్పించడంతో రైతులకు అమ్ముకునే హక్కు వస్తుందన్నారు.

కల్యాణమస్తు, షాది తోఫా చెక్కు పంపిణీ

మండలంలో జగనన్న కళ్యాణమస్తు, షాది తోఫా కింద 36 మందికి రూ. 31 లక్షల 60 వేల మెగా చెక్కును ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అరణి విద్యానాథరెడ్డి, ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి, తహసీల్దారు భార్గవి, ఏఓ త్రివిక్రమ్‌రావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు గోపాల్‌రెడ్డి, మణినాయుడు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలానుగుణంగా బోధనలో మార్పు రావాలి


మాట్లాడుతున్న ఎంఈఓ ముని సుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ; పిల్లల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు మాతృభాష తెలుగు కీలకమని, విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా బోధన చేయాలని ఎంఈఓ మునిసుబ్రమణ్యం తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య పర్యవేక్షణలో బీఎన్‌కండ్రిగ, వరదయ్యపాళెం, సత్యవేడు, మండలాల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయులకు ఒక్క రోజు శిక్షణ తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా వినూత్న ఆలోచనలతో బోధన చేయాలన్నారు. విషయ నిపుణులుగా యువశ్రీమురళి వ్యవహరించగా, పురుషోత్తం, మున్నెయ్య, అమరనాథ్‌రెడ్డి, నాగరాజు, ఏడుకొండలు, తదితరులు బోధనా అనుభవాలు పంచుకున్నారు. ఉపాధ్యాయులు గిరి, శిరోమణి, సుబ్బారావు, చెంగాళమ్మ, సరళ, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు సిపాయి భరోసా


సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సుబ్రమణ్యం

తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇటీవల మృతిచెందిన వన్నె రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలకు ఎమ్మెల్సీ, రష్ అధినేత డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం బుధవారం సిపాయి భరోసా కింద నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తొట్టంబేడు మండలం జ్ఞానాంబ కండ్రిగకు చెందిన కామాక్షమ్మ, శ్రీకాళహస్తి మండలం టీఎంవీ కండ్రిగకు చెందిన వరదారెడ్డి ఇటీవల మృతి చెందారు. బుధవారం సిపాయి సుబ్రమణ్యం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వారికి సిపాయి భరోసా కింద 41 రకాల నిత్యావసర సరుకులను అందజేశారు. వన్నెకుల క్షత్రియ సామాజిక నేతగా ఆ కుటుంబాలకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గురవారెడ్డి, బత్తిరెడ్డి, భరత్‌రెడ్డి, రత్నంరెడ్డి, దశరథరామిరెడ్డి, మహదేవయ్య, హరినాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్ ఐసీటీసీకి ఎన్‌ఏబీఎల్ అవార్డు


ఐసీటీసీ సిబ్బందిని సత్కరిస్తున్న స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్

తిరుపతి తుడా: స్విమ్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్, టెస్టింగ్ సెంటర్ హెచ్ఐవీ టెస్టింగ్ ల్యాబ్ (ఐసీటీసీ)కి న్యూఢిల్లీకి చెందిన క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెడికల్ (ఎంట్రీ లెవెల్) టెస్టింగ్ ల్యాబ్స్ వారు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ టెస్టింగ్ క్యాలిబ్రేషన్ ల్యాబొరేటరీస్ (ఎన్ఏబీఎల్) అవార్డును ఆన్‌లైన్ ద్వారా అందజేశారు. స్విమ్స్ ఐసీటీసీ ద్వారా మెరుగైన ప్రయోగశాలలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తుందని గుర్తించారు. పరికరాల అమరికలు, రికార్డులు, నివేదిక, నిర్వహణ కచ్చితమైన ఫలితాలను పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డును అందించారు. ఈ సందర్భంగా బుధవారం అవార్డును తీసుకున్న ఐసీటీసీ సిబ్బందిని స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్వీ కుమార్ అభినందించారు.

ఎడతెరిపి లేని వర్షం

- స్తంభించిన జనజీవనం
- చెరువులకు జలకళ
- పంటలకు సాగు నీటి కళ
- లోతట్టు ప్రాంతాలు జలమయం


శ్రీకాళహస్తిలో కురుస్తున్న వర్షం


ఏర్పేడు చెరువుకు చేరుతున్న నీరు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలో బుధవారం కుండపోత వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ముసురు కమ్ముకుంది. బంగాళఖాతంలో అల్పపీడనం కారణంగా మధ్యాహ్నం ఒంటి గంట నుంచి వర్షం ప్రారంభమైంది. రాత్రి వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. పట్టణంలోని పలువీధులు జలమయంఅయ్యాయి. పట్టణంలోని జయరామరావు వీధి, పూసలవీధి, మంగలివీధి, గాంధీవీధి, బీపీఅగ్రహారం తదితర వీధులు జలమయం కావడంతో రాకపోకలకు ఇబ్బంది కరంగా మారింది.

చెరువులకు చేరుతున్న నీరు

ఏర్పేడు: రెండు రోజులుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువులకు నీరు చేరుతోంది. మండలంలో 86 ఇరిగేషన్ 54 ఊటగుంటలు ఉన్నాయి. ఇప్పటి వరకు వర్షాలు రాకపోవడంతో ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయసాగు కష్టతరమవుతుందని రైతులు ఆందోళనలో పడ్డారు. కొంతమంది రైతులు వ్యవసాయ బోర్ల ద్వారా వరి నారుమడులు ఏర్పాటు చేసుకున్నారు. చెరువుల ఆధారంగా వరిసాగు చేసే రైతులు వరి నారుమడులు సిద్ధం చేసుకోలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో చెరువులు జలకళ సంతరించుకుంటాయని, ఖరీఫ్ సాగుకు ఇబ్బందులు తప్పినట్టేనని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేణిగుంట లోతట్టు ప్రాంతాలు జలమయం

రేణిగుంట: తుపాను ప్రభావంతో రేణిగుంటలో బుధవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఎడతెరపి లేకుండా జోరువాన కురిసింది. వర్షపు నీటితో జనజీవనం అస్తవ్యస్థమైంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల ఇళ్లచుట్టూ నీళ్లు చేరాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. పంటచేళ్లలో వరినాట్లు నీటమునిగాయి. కరకంబాడి పంచాయతీ తారకరామానగర్, వెదుళ్లచెరువు ఎస్టీ కాలనీ, గుత్తివారిపల్లె ఎస్టీ కాలనీ, కృష్ణాపురం ఎస్సీ, ఎస్టీ కాలనీలు, కుర్రకాల్వ పద్మనగర్, ఎర్రమరెడ్డిపాళెంలో పలు ఇళ్లు చుట్టూ వర్షపు నీరు చేరింది. తారకరామానగర్‌లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. గ్రామీణ రోడ్లు బురదమయంగా మారాయి. దీంతో రాక, పోకలకు తీవ్ర ఇబ్బందులెదురయ్యాయి. తుపాను ప్రభావంతో మరో నాలుగు రోజులు మరింత బలంగా వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో అధికారులు విపత్తు నిర్వహణ చర్యలకు సమాయత్తం అయ్యారు. వీఆర్వోలు, కార్యదర్శులు ఎప్పటికప్పుడు తుఫాను నష్టం గురించి సమాచారం ఇవ్వాలని తహసీల్దార్ ఉదయ్‌సంతోష్ ఆదేశించారు. మండలంలోని కరకంబాడి సమీపంలోని మల్లిమడుగు రిజర్వాయర్‌లోకి శేషాచలం అడవుల నుంచి వర్షపు నీరు వచ్చి చేరుతోంది.

వర్షపాతం ఇలా...:	
రేణిగుంట	- 37.2మి.మీ
ఏర్పేడు	- 30. 6 మి.మీ
శ్రీకాళహస్తి	- 17.4 మి.మీ
తొట్టంబేడు	- 20.0 మి.మీ


సత్యవేడు నియోజకవర్గంలో..

వరదయ్యపాళెం: బంగాళఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా సత్యవేడు నియోజకవర్గంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షం పడుతుండడంతో చెరువులు, కుంటలు, సాగునీటి కాలువలకు జలకళ వచ్చింది. సంవృద్ధిగా సాగునీరు చేరడంతో పంటలు కళకళలాడుతున్నాయి. ప్రస్తుత రబీ సీజన్‌లో ఇదే పెద్ద వర్షంగా చెప్పుకోవాలి. పంటలు సాగు చేసి 50రోజులు పైగా పూర్తి కావస్తున్న తరుణంలో అక్కడక్కడా సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్న తరుణంలో కురిసిన ఈ వర్షం ఊరటనిచ్చింది. జనజీవనం స్తంభించింది. రోజు వారీ కూలీలు, నిర్మాణ రంగ కూలీలు పనులు లేక ఇబ్బందిపడుతున్నారు. అలాగే మగ్గపు గుంతల్లోకి నీరు చేరడంతో పనులు కోల్పోయారు. మండలంలోని బీజీఆర్‌కాలనీ, అనిల్ కాలనీ, పల్లపు తాగేలి ప్రాంతాల్లో వర్షపునీరు చేరింది. తాగేలి ప్రాథమిక పాఠశాలలోకి వర్షపునీరు చేరడంతో నిర్వహణ ఇబ్బందిగా మారింది. పెద్ద పాండూరు పాతదళితవాడలో వర్షానికి దాసరి మహేష్‌కు చెందిన పూరిల్లు గోడలు కూలడంతో పాటు పైకప్పు దెబ్బతింది.

రాకపోకలు బంద్

శ్రీకాళహస్తి: భారీ వర్షంతో వాగులు దాటనివ్వకపోవడంతో తొట్టంబేడు మండలం కారాకొల్లు, బోనుపల్లి గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. వరినార్లు నీటమునిగాయి. మండలంలోని చిట్టత్తూరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. మేకలు వాగులో దిగి కొట్టుకుపోవడంతో వెంకటేశు అనే మేకల కాపరి వారిని రక్షించేందుకు వాగులోకి దిగి కొద్ది దూరం కొట్టుకుపోయాడు. కేకలు వేయడంతో అక్కడున్న వారు తాళ్ల సాయంతో అతన్ని వాగునీటిలో నుంచి ఒడ్డుకు చేర్చి రక్షించారు. తొట్టంబేడు తహసీల్దార్ సుధీర్‌రెడ్డి తుపాను ప్రభావం గురించి సహాయక చర్యల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి వరద పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.


వరదయ్యపాళెంలో రోడ్డుపై వర్షపునీరు


అంజిమేడు పొలాల్లో వర్షపు నీరు

టీటీడీ ఆలయాల్లో విశేష ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: టీటీడీ స్థానిక ఆలయాల్లో డిసెంబర్ నెలలో విశేష ఉత్సవాలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా డిసెంబర్ 10న శ్రీగోవిందరాజస్వామి వారు తిరుపడి సన్నిధికి వేంచేపు చేశారు. 11న శ్రీకపిలేశ్వరాలయంలో కార్తీక సోమవారాభిషేకం నిర్వహిస్తారు. 17వ తేదీన తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంతోపాటు ఇతర ఆలయాల్లో ధనుర్మాసం ప్రారంభం కానుంది. 22 నుంచి 26వ తేదీ వరకు శ్రీకపిలేశ్వరాలయంలో స్వామివారి తెప్పోత్సవాలు వేడుకగా చేపట్టనున్నారు. 23వ తేదీన శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి నిర్వహిస్తారు. 27వ తేదీన శ్రీకపిలేశ్వర స్వామివారి ఆలయంలో ఆరుద్ర దర్శన మహోత్సవం నిర్వహించనున్నారు.

శ్రీవారి సేవలో వ్యాసరాయ మఠం పీఠాధిపతి


ఆలయంలో మఠం పీఠాధిపతి విద్యా తీర్థ స్వామీజీ

తిరుమల: శ్రీవారిని వ్యాసరాయ మఠం పీఠాధిపతి విద్యా తీర్థ స్వామీజీ దర్శించుకున్నారు. బుధవారం తిరుమల శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు రిసెప్షన్ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.